

అవకతవకగా నిర్ణయాలు తీసుకునే రాజకీయ ప్రభుత్వాలకు,
ఆమె ఒక నిలువెత్తు ప్రశ్న! ఆమె నిర్ణయం ఒక వెక్కిరింత!
బతుకుకు బంధమే అడ్డు అయినప్పుడు... అంతకంటె ఆమె ఏం చేయగలదు?
ఆమె తొక్కిన బాట... ఇంకా ఎన్నో రకాల సమస్యలకు
పరిష్కారమో, ప్రత్యామ్నాయమో అవుతుందా?

కె.ఎ. మునిసురేష్ పిళ్లె

# 15 గేణమ్మ

అన్వర్





వెదజల్లిన పెద్దగుడి అమ్మోరి కుంకంలాగా నేలంతా పరచుకుని ఎర్రగా మెరస్తండాయి రాలిన తురాయిపూలు. ఆటి మద్దెలో చెట్టు మొదులుని ఆనుకుని, యెలిసిపోయిన పసుపురంగు నేతచీరలో, పండగలకీ పబ్బాలకీ కలిసెం ముందర తమలపాకు మీద పెట్టే పసుపు ముద్ద వినాయకుడి మాదిరిగా గుట్టుగా గొంతు గూసోనుండాది గేణమ్మ!

ఆగి ఆగి యీస్తాండే గాలికి రాలుతున్న ఒకట్రెండు తురాయి పూలు ఆమె మీద గూడా పడతాండాయి.

కండ్లు తెరవని బిడ్డ మాదిర్తో నిప్పుల చెండు నీట్లో ఉండం గానే, ఎప్పుటిలాగానే ఆరోజు గూడా నిద్దర్లేసింది గేణమ్మ. బోరు కాడికి బొయ్యి రెండు బిందెల నీళ్లు తెచ్చుకోని తొట్టిలో పోసుకునింది. పసుపుకొమ్ము సాదుకోని, మొహానికి చేతులకి కాళ్లకి పూసుకునింది. మెళ్లో పుస్తెలతాడు నల్లగా కమురుపట్టి, వంటి రంగులో కలిసిపోయి ఉంది. దానికి దట్టించి మరీ పూసింది పసుపు. స్నానం ముగించి, నొష్టన పావలా కాసంత కుంకంబొట్టు పెట్టుకుంది. గూట్లో నాలుగు మట్టిగాజులుంటే తీసి చెరో చేతికి రెండేసి వేసుకుంది.

ఈలోగా, కడుపు చించుకున్న బిడ్డ కాళ్లమీద పడినట్టుగా, నీళ్లను చీల్చుకుంటూ నింగిమీద పడింది నిప్పుల చెండు. సట్టిలోని సద్దికూట్లో ఉప్పుగల్లూ, రొవ్వన్ని మజ్జిగనీళ్లు పోసి పిసికి వేలితో ఓ చుక్క నాలికమీద యేస్కోని ఉప్పు జూసుకునింది. అంతేతప్ప తినాలనిపించలా. ఎరగడ్డ తపక వొలిచి సట్టి మూకుడు మీద బెట్టింది. గడపలోనించి చూపు పారించి, యింటికి కొంచెం ఎడంగా సీమసింత గుబ్బల చెట్టు కింద నులకమంచానికేసి చూసింది. నాలుగు క్షణాలు చూపులట్టే నిలబడిపాయినాయి. చిన్న దిగశోసతో చూపు నేలమీదికి దించింది. మజ్జిగంటిన చేతిమీద చారెడు నీళ్లు పోసుకుని కడుక్కున్నట్టుగా యిదిలించి తడిచేతిని కొంగుకు తుడుచుకుంది.

తెల్లతోలు చెర్నాకోల పట్టుకుని ఒంటిచక్రం బండి మీద ఊరేగేటోడు రెండు జానలెత్తు ఎగబాకక ముందే ఇంట్లోంచి ఎల

బారింది. కుడిఎడంగా పదిమైళ్లుంటాది. తిమ్మసముద్రం నుంచి కాళాస్తికి. కొండలూ అడవులూ లెక్కాజమా లేకుండా తొక్కుకుంటూ తిరిగే పాదాలకి ఆ దూరం ఒక లెక్కలోంది కాదు. అందుకే నడుచుకుంటా కాళాస్తికి చేరుకుంది. తురాయిపూల చెట్టుకింద గేణమ్మ కొలువుతీరే పాటికి ఆడంతా కాళీగా ఉండాది. దూరంగా గోడకి చేరబడి తుప్పు పట్టిపోతున్న ఒక సైకిలు పడుండాది. ముందర చక్రాన్ని యెవురో యిప్పుకొని యెత్తుకెళ్లినట్టుండాది. ఒంటిచక్రంతో నడ్డిరిగినట్టుగా పడుండాది ఆ సైకిలు. దానిచుట్టూ కంపలు, తుప్పలు మొలిచి ఉన్నాయి. 'యిది మతిలేని ముండ,' ఆ సైకిలును వుద్దేశించి.. మనసులోనే మెటికలు యిరిచింది గేణమ్మ.

యెదురూగా జమీందార్ల కాలంనాటిది, సున్నంతో కట్టిన పాత లంకంత మేడ. మేడ వాకిలి వసారా చేరాలంటేనే పది మెట్లెక్కాల. బడి మాదిరిగా రొమ్మి రుసుకోని, గుడి మాదిరిగా గంబీరంతోని వుండాది. ఆ రోజుల్లో జమీందారు కాడికి తగాదాలు తెస్తే... మంచీ చెబ్బరా, నాయం అన్నేయం ఆయన జెప్పేవోడంట, వసారాలో పెద్ద సిమ్మాసనంలాంటి కుర్చీ యేసుకోని. ఇప్పుడు కుర్చీలు లోపలికి మార్నాయంతే, యింకేం మారలా అనుకుంది. 'యీ మేడ సాచ్చిగా యెన్ని కొంపలు కూలినాయో, యెన్ని తాళ్లు తెగినాయో...' అక్కసుగా అనుకుంది! అంతలోనే తల విదిల్చి, 'అట్టాగే జరగాలని యేముండాదిలే... యెన్ని బతుకుల్ని నిలబెట్టిందో... యెన్ని కొంపల్లో దీపం యెలిగించిందో యీ మేడ,' అనుకుని, తన మాటల్ని తానే తప్పుబట్టుకుంది. పొద్దింకా ముదరలా. ఒకటీ అరా మనుసులు ఆ మూలకీ యీ మూలకీ జేరుకుంటా వుండారు.

మేడమిందనే చూపుల్ని నిలబెట్టి, ఓసారి మెళ్లోని పుస్తెలతాడుని తడుము కుంది. చేతికందిన ఒక చిన్న గులకరాయితో పిచ్చి గీతలు గీస్తూ చూపు నేలకేసి తిప్పింది. మట్టిగొట్టుకు పోయిన పాదాలు అగుపించాయి. వేళ్లకున్న వెండి మెట్టెలు తెల్లగీతల్లాగా మెరస్తుండాయి. కొండలూ తుప్పలూ తిరిగే మొండి పాదాలు అవి. వేళ్ల తొలిగెణుపులు కాయగట్టి లావుగా మారి ఉన్నాయి. మెట్టెలు బాగా అరిగి వదులై, గాజుల్లాగా కదలతండాయి. గెణుపులు అంత లావుగా లేకుంటే ఊడి జారి పోయేవే. పిచ్చిగీతలు మానేసి, చూపుడువేలితో ఆ మెట్టెల్ని కదిలిస్తూ చూపుల్ని అక్కడే పాతేసింది గేణమ్మ.

యింకో చేత్తో మెళ్లో పుస్తెలతాడును మళ్లీ తడుముకుంది. ఆడ గూసున్నాక, అది ఇరవయ్యారోసారి! పసుపు బాగా పులిమిందేమో... తాడు ఇంకా తడిగానే తగల్తాంది. అది కాస్తా అలా కిందికి, రైక కిందికి జారి పై గుండెల మధ్య

ఇరుక్కోనుండాది. తాడులో తడి బరువుగా యింకుతున్నట్టుగా... లోగుండెల్లో తడి ఏదేదో సడి చేస్తండాది.

'యీపొద్దు దాటినాక యీటిని ఉంచాల్నా తీసేయాల్నా,' తడుముకున్న ప్రతిసారీ ఆ మాట, ఆ సడిలో రేగతాంది. 'ఆడితోపాటే నా వొంటి మీదికి వొచ్చినాయి యివ్వి. ఆడితో పాటే వొగ్గేయాల గదా,' అని అనుకుంది. 'వోడిని వొగ్గినట్టే వొగ్గాల గావాల.' అంతసేపు ముంగిమాదిరిగా వుండిన మూతి, కొంచెం విచ్చుకుంది. వక్క సున్నం కలిపి నమిలిన ఆకు పూసిన ఎరుపు, రెండు పెదవుల మద్దెన ఎర్రగీతలాగా మెరిసింది.

'గంట పదిగొట్టక ముందే వొచ్చెయ్యాల కోర్టు కాడికి...' అన్నాడు వకీలు, వారం దినాల కింద. ఆయనిల్లు యీడకి అమ్మీడే ఉంటాది, నడుసుకుంటానే వొస్తాడు, యింకో గడియకో రెండు గడియలకో వొచ్చేస్తాడు అనుకునింది గేణమ్మ! కళ్లలోకి ఎండ పడకుండా చేతిని అడ్డు పెట్టుకుని, కోర్టులోకి వకీలు వొచ్చే దారికేసి పారించి చూసింది.

*

అయి శివరాత్రి దినాలు. అప్పటికి నిండా పదైదేళ్లు ఉంటాయేమో గేణమ్మకి. ఇంకా గొడ్లని మేతకోసం అడవుల్లోకి తోలుకెళ్లేంత వయసు రాలేదు. రెడ్డేరి కొట్టాంలో పేడాచెత్తా ఎత్తడమూ, సుబ్బరంగా చిమ్మి పెట్టడం వరకే ఆ పిల్ల పని. నిజానికి పేడలో కసువూ కాసిని బొగ్గు ముక్కలూ యేసి గోడకి పిడకలు కొట్టడం అంటే ఆ పిల్లకు చానా కుశాల. కానీ రెడ్డేరమ్మ ఆ పని చేయనిచ్చేది గాదు. అసలే ఆ పిల్ల చిన్నది. చిట్టెడంత చేయి. ఆ చేత్తో కొడితే, పిడకలు మసాలా వడల మందాన వస్తాయే తప్ప, పొయ్యిలోకి పనికిరావని రెడ్డేరమ్మ నమ్మకం. ఇలా కుశాల తీరకుండానే గొడ్ల పనితో యెళ్లదీస్తున్న గేణమ్మతో ఒక సాయంత్రం రెడ్డేరమ్మ ఇలా చెప్పింది.

"మేయ్! రేపుట్నుంచి నువు పన్లోకి రాబళ్లే. పెళ్లంట గదా! యిదిగో... ఈ రెంద్రూపాయిలూ తీస్కోనిబొయ్యి గాజులు, బొట్టూ కాటుకా కొనుక్కో," అంటూ చేతిలో డబ్బులు పెట్టింది.

పెళ్లి యెవురికో, గాజులు తానెందుకు పెట్టించుకోవాలో ఆ పిల్లకు గెమనానికి రాలా. కానీ ఆ మరురోజు శివుడి తిరనాళ్లలో దేవుడి పెళ్లినాడు నాయినా అమ్మలతో కాళాస్తికి పొయినాక, సందేళ యేట్లో ముంచి, తనకు పసుపుచీర కట్టిన తర్వాతగానీ ఆ పసిపిల్లకి పెళ్లి యెవురిదో అర్థంకాలా! అట్టా గేణమ్మకు పెళ్లయింది.

మొగుడికి అప్పటికి ముప్పయ్యేళ్లు వుంటాయేమో. పోట్లగిత్తలాగుండేవోడు. గిత్తంటే మామూలు గిత్త గాదు. కపిలబాన తోలినాడంటే మద్దెలో ఎద్దుల జత మార్చాల. యేతమేసి తోడినాడంటే సందేళకల్లా ఎకరాలు తడిసిపోవాల. పిడికిట్లోకి కట్ట జవురుకోని నూర్పిళ్లకి దిగినాడంటే మూటలు నింపుకోని బండ్లకు బండ్లు పోతుండాల్సిందే. అంతటి పనోడు!

అట్టాంటి మొగుడికి పెళ్లాంగా కాపురానికి తిమ్మసముద్రం వొచ్చినాక గేణమ్మ, 'యింకా చిట్టెడు చేతుల పసిపిల్లే,' అనే సంగతి ఆ ఊరు గుర్తించలేదు. ఆ పిల్లా మర్చిపోయింది! పొద్దు పొడవకముందే నిద్దర్లేవడం.. సద్ది తాగి పొలం పన్లకు పోవడం... కాళీ ఉండే రోజుల్లో అడవికి పొయి, కట్టెలు కొట్టుకొని మోపు కట్టుకుని రావడం, పక్కన పక్కన పల్లెల్లో తిరిగి ఆ మోపుల్ని పావలాకో అర్ధకో అమ్మడం... ఇదే ఆమె బతుకయిపోయింది. మొగుడేమీ ఒళ్లు దాచుకునే రకంకాదు. ఇంటా బయటా వాడి వంతు కష్టం వాడు చేస్తూనే వుండేవాడు. రెండేళ్లు గడిచేపాటికి గేణమ్మ కడుపున కాయ కాసింది. మగబిడ్డ. ఆడి కోసం, రొమ్ములెండిపోయేలోగా ఒక బర్రి గొడ్డును పట్టాలనుకున్న గేణమ్మ కోరిక తీరనేలేదు. అయినా గేణమ్మ మొండిది. పాడిగొడ్లు వుండే ప్రతి యింటికీ వెళ్లి గొడ్డుచాకిరీ చేసేది. దినామూ ఏదోవొక ఇంటి నుంచి లోటాడు పాలు పుట్టించేది. వాటిని ఆ బిడ్డకు తాపించేది. ఇట్టా ముదిగారంగా సాకిన కొడుకు యెడవయసుకు వొచ్చేసాడు. శివరాత్రి తిరణాలలోనే దేవుడి పెళ్లితోపాటే వాణ్నీ ఒకింటివాణ్ని చేసింది. బండెడు కష్టానికి మూకుడు గింజలు కూడా పుట్టని పల్లెబతుకు వాడికి కష్టం అనిపించింది. కట్టుకున్న దాన్ని తొడుకోని, వొంటికి సుఖమైన పనులెతుక్కుంటా వోడు వలసబొయినాడు. 'రెక్క లొచ్చిన బిడ్డలు గూడా... గూడు వదలకుండా కూసోని, అయ్యా అమ్మల నోట్లో కూడూ జవురుకుని బొక్కే రోజులియ్యి. నా బిడ్డ బంగారం. వాడి బతుక్కి వోడే ఒక తోవ జూస్కున్నాడు,' అని సరుదుకుని ఏడుపుని మింగింది గేణమ్మ.

గూట్లో జోడు పిట్టలే మిగిల్నాయి. బతుకు ఎగుడుదిగుడులుగా దొర్లిపోతానే వుంది. సొంతానికంటూ బూమి ఏర్పడలేదు. చెమట చిందకుండా చిల్లిగవ్వ రాకడ లేదు. రెక్కలొక్కటే దిక్కు. కడుపు నిండాలంటే ముక్కలు జేస్కోవడమే తెరువు.

తొలినాటినుంచీ వోళ్ల సంసారం బండిలాంటిది గాదు, మడకలాంటిది! జోడెడ్లు లేకపొయినా ఒంటెద్దుతో గూడా బండి వుంటాది.. ఎద్దుల అవసరమే పడకుండా ఒంటిచక్రంతో గూడా తోపుడు బండి ఉంటాది. కానీ ఒంటెద్దుతో మడక యేడైనా వుంటాదా...? వుండదు గదా! ఆళ్ల బతుకలాంటిది. గేణమ్మా దాని మొగుడే

ఆ జోడెద్దులు. ఏ ఎద్దు బద్దకించినా మడక నడవదు! ఏ ఒక్కరు బిక్కరించినా కడుపు నిండదు.

ఇట్టాంటి కనాగష్టపు బతుకులోనూ గేణమ్మంటే పేణం దాని మొగుడికి. పెళ్లయిన కాణ్నించీ వోడికి ఆ పిల్లంటే వల్లమాలిన ఇష్టం. పువ్వుల్లో బెట్టి జూస్కునే టంత ముల్లె వాడి దగ్గర లేదుగానీ... పిల్లని మాత్రం పువ్వులాగానే జూసుకునేవోడు. బతకడానికి దుడ్లు గావాలి గనక యిద్దురూ పన్లోకి బోవాల్సిందే తప్ప యింటి పనుల మాటకొస్తే... తనకు చేతనైనదంతా చేస్తూనే వుండేటోడు. పల్లెత్తు మాట అనడు. కసురుకోడు, యిసుక్కోడు. బయటున్నంతసేపూ వాడు పులిలాగా ఊరేగుతాడో, పనిమంతుడిలాగా బిగుమానం పోతాడో వాడిష్టం. కానీ, చూరుదాటి కొంపలో అడుగు పెట్టినాడంటే పంటి కిందకైనా వంటి కిందకైనా, గేణమ్మ ఏంజేస్తే అది... గేణమ్మ ఏం జెప్తే అది, అంతే! అంత యిష్టంగా, పేణంగా జూసుకునేవోడు.

పెపంచికంలో రోజుకో కొత్త వింత పుట్టుకొస్తావుంటే... యెవురి బతుకులు మాత్తరం ఒకే తీరుగా ఎందుకు సాగతాయి. మొగుడూ పెళ్లాలకి వయసు మీది కొస్తుండాది. గేణమ్మ మొగుడి పనితనంతో, అనుబవంతో పనిలేని మోటార్లొచ్చినాయి. మరమిషన్లొచ్చినాయి. సేద్దెం అనేటిదే మట్టిపిసికేవోడి బండ చేతుల్లోంచి నిదానంగా జారుకోని, నట్టింటినిండా ముల్లె ఉండేటోడికి మటుకే కుదిరే యవ్వారంగా మారి పోయింది. 'చేతనైంది మటుకే చేయాలనుకుంటే ఎట్ట? చేస్తా వుంటే చేత కాకుండా బొయ్యేది యేటుంటాది? కస్టాన్ని నమ్ముకున్నోడికి లొంగని విద్దె వుంటాదా...' అనుకుంటా దాని మొగుడు ఏ పని దొరికితే ఆ పనికి బొయ్యేటోడు.

ఎన్ని విద్దెలు నేర్చినా, ఎన్ని చిన్నెలు పోయినా మడిసనే వోడు ఎప్పటికైనా అల్పుడే అని గేపకం చేసేదానికి కాలం అనే మాయొకటుంటాది. కష్టానికి గూడా కొరగాకుండా కొంచిం కొంచింగా అది కబళించేస్తా వొస్తాది. గేణమ్మ మొగుడికి వయసు మీద పడతా వుంది. కండల్లో సత్తువే దిగిపొయినాక సత్తుపైసా పాటి జెయ్య కుండా పొయినాడు పాపం! పన్లకి పిలిసేటోళ్లు లేరు. మడిసి ఖాళీ అయిపొయినాడు- బయటా, లోపలా కూడా!

తిరగ మరిగిన కాలూ, తిన మరిగిన నోరూ ఊరుకోవని పెద్దోళ్లంటారు. కానీ, పని మరిగిన మడిసిని ఊరికే కూసోబెట్టడమంత దరిద్రం యింకోటిలేదు! వోడికి ఏదో ఒకటి వ్యాపకం ఉండే తీరాల...! అదికాస్తా సావాసాల్లోకి మారింది. ఖాళీ వున్నప్పుడెల్లా తాగుడు మొదులైంది. అదివరకు తాగడమే ఎరగనోడు అని

కాదుగానీ... ఊపిరాడనియ్యని పనుల మద్దెలో ఎప్పుడో ఒకప్పుడు అదొక ముచ్చటగా ఉండేది. ఇప్పుడు అదే పనిగా అయిపోయింది.

ఒకటా రెండా గేణమ్మకీ వోడికీ పదైదేళ్ల వారా! వోడు ముందే ముసిలోడై పొయినాడని పొద్దు పొడవడం మానేస్తాదా? కడుపు అరవడం ఆపేస్తాదా? ఒంటి కష్టం మీదనే యింటిని నెట్టుకు రావాల. రెండో యెద్దు చూపుకి వుంటే సాలు, కాడిని బుజాన యేస్కుంటే సాలు.. గేణమ్మ బతుకు మడకని లాగకుండా బోతాదా? యిట్టాంటి రోజొకటి రాకుండా వుంటాదని గేణమ్మ కలగనిందేమీ లేదుగదా!

'వోడట్టా గుళ్లో లింగంలాగా, నొస్టన కుంకంలాగా యింటికాడ మెదలకుండా గూసోనుంటే సాల్లే,' అనుకునింది.

యిప్పుడు సేద్దెంలో మడుసుల అవసరమే తగ్గిపోయింది. నాట్లు లాంటి పన్లకి తప్ప పిలవడమే లేదు. అయితే లోకం గొడ్డుబోలేదు. కూలిపన్లు తప్ప దిక్కే లేనోళ్లకి ఉపాది పన్లొచ్చినాయి. గేణమ్మ గూడా ఆ పనుల్లో జేరింది. కూటికీ గంజికీ యెతుక్కోకుండా ఇల్లు గడస్తాంది.

చానా చానా కొంపలకీ గేణమ్మ యింటికీ ఒక వారా వుండాది. దాని మొగుడు పనులు జేసే వొయసు దాటిపొయ్యుండొచ్చుగాక... కానీ, 'ఒసేయ్ తాగడానికి డబ్బుంటే ఇయ్యి,' అని ఏరోజూ దాన్ని దేబిరించిందిలే, బెదిరించిందీలే! అందుకు ఓ కారణముండాది. వోడికి సర్కారోళ్ల పించనొస్తాది. రెండొందలో అయిదొందలో- ఆ రోజుల్నించీ పుచ్చుకుంటానే వుండాడు. అది రొవంత రొవంతగా పెరిగి వెయ్యయి, రెండు వేలయి, రెండున్నరయ్యి... వోడికి సుకంగా జరిగిపోతండాది. ఆ దుడ్లని నమ్ముకోని సారాకొట్లో ఖాతా పెట్టుకోని నెలపొడుక్కీ తాగతా వుంటాడు. పించను చేతిలో పడగానే ముందర ఆడ లెక్క కట్టేస్తాడు. రోగమూ రొష్టూ లేపోతే రెండు ముసిలి పేణాల జరుగుబాటుకు సరిపడా దుడ్లు ఉపాది పనుల్లో యెటూ గేణమ్మ తెస్తానే ఉండాది!

'వోడు ఆ మిగులూ తగులూ నా చేతిలో పెట్టకపోయినా పర్లే,'దనుకునేది గేణమ్మ! 'ఎంతమంది నా బట్టలు పెళ్లాల్ని జుట్టుబట్టి వంగదీసి దబీ దబీమని యీపు మీద గుద్ది... దాని కూలిడబ్బులూ లాక్కపొయి తాగడం లేదు. యీడు అట్టాంటోడు గాదు,' అని తన మొగుడి గురించి మురిసిపోయేది!

నిరుడు, ఆ రోజున అట్టా జరగకపొయ్యుంటే... గేణమ్మ మురిసిపాటు మిడిసిపాటుగా మారేదే!

*

చెరువులో పూడిక పని. ఆని నెల... కాలం దాటిపొయ్యిందన్న మాటేగానీ ఎండలు మిడిమేళంగా కాస్తుండాయి. చెరువులో పనికొచ్చేవోళ్లు యిళ్లలోంచి కుండల్తో నీళ్లు తెచ్చుకుంటాండారు. ఆ పన్లకి పోయింది గేణమ్మ. పూడిక మట్టిని పారల్తో తవ్వి తట్టలకెత్తతా, తట్టల్ని నెత్తికెత్తుకోని ట్రాక్టర్లలో పోస్తా... అన్ని పనుల్నీ మార్చిమార్చి చేస్తానే వుండాది. రోజూ చేసే పనేగానీ, ఆరోజు ఎండకి శోషొచ్చి పడిపోయింది. నానా గోలా అయిపోయింది. ఎవురో కుండలో నీళ్లు తెచ్చి మొహాన జల్లి లేపినారు. చెరువుమద్దెలో చెట్టునీడ మటుకు ఏడుండబోతాది? గేణమ్మ చేతిని బుజాన యేస్కోని యింకో పిల్ల నెమ్మదిగా నడిపించుకుంటా కట్టమీదకు తీస్కబొయ్యి, యేపచెట్టు నీడలో పడుకోబెట్టింది. ఆమె మట్టితట్టలు మోసేప్పుడు తలకుదురు కోసం తెచ్చుకున్న తుండుగుడ్డను తలకింద దిండులాగ పెట్టింది. ఆడదాకా ఎట్టా నడిసొచ్చిందోగానీ మడిసి సోదీనంలో లేదు. సల్లంగ యేపచెట్టు గాలి తోల్తాంటే... గుర్రుమని బుసకొడుతా నిద్దట్లోకి జారుకునింది.

గంట దాటుంటాదేమో.. గేణమ్మ కొంచిం సోయిలోకొచ్చి చూసేయేళకి.. అందురూ పన్లు దిగేసి మొరవ కాడున్న నీళ్లగుంటలో కాళ్లూ చేతులూ కడుక్కుంటాం డారు. మేస్త్రీ గేణమ్మ కాడికి వొచ్చాడు.

''యేందవ్వా... యీ వొయసులో నీకింకా పన్లు గావాల్నా...'' అన్నాడు ఊరడింపుగా నవ్వతా!

''బువ్వ గావాల్సినంత కాలమూ తొవ్వ గావాల్సిందే గదా,'' అంది గేణమ్మ.

''నీ తొవ్వని దొంగలెత్తుకెళ్లా.. లేసి కూసున్నావు గాబట్టి యేదాంతం జెప్తుండావు. ఆణ్నే గుటుక్కుమని వుంటే ఈ పాటికి అందురూ గల్సి నా తాడు తెంచతా వుండేవోళ్లు, ముసిల్దాన్ని మింగేసినానని... సాల్సాల్లేగానీ రేపుట్నించి రాబాక... యింకేదైనా నీడపట్టున వుండే పన్లు జూసుకో,'' బండ యేసేసినాడు మేస్త్రి!

యేదో ఒకనాటికి యీ మాట రానే వొస్తాదని తెలుసు గేణమ్మకి! పనిలో దిగిందంటే పడుచు పిలకాయిల మాదిరిగా వొళ్లు దాచుకునేది తెలవనే తెలవదు. అంతమాత్తరాన సర్కారోళ్ల కాయితాల్లోకి యెక్కిన వొయసు దాచుకోవాలనుకుంటే, యెట్టా కుదర్తాది!?

''అరవయి అయిదేళ్ల ముసిల్దాన్తో పన్జేయిస్తుండానని తెలిస్తే.. యెవురైనా నా మొహానే వూస్తారు...'' మేస్త్రీ కాయితాల్లో జూస్కుంటా గొనుక్కుంటా బోతండాడు.

గేణమ్మ కట్రాట అయిపోలేదు... కన్నీళ్లు పెట్టుకోలేదు! 'అయ్యా దయపెట్టు,' అని దేబిరించలేదు! 'నా యిల్లు గడిసేదెట్ట నాయినా,' అని విలాపించలేదు! 'నన్ను

పన్లోంచి తీసేస్తావా... నీ సంగతి జూస్తా,' అని ప్రలాపించలేదు! మౌనంగా లేచి, మడిచి తలకింద పెట్టిన తుండుగుడ్డ యిదిలించి, వొంటికీ చీరకీ అంటిన మట్టినీ చెత్తనీ దులుపుకుంది. కట్టదిగి యింటిదారి పట్టింది.

'యీ చెరువు పన్లు కూడుబెట్టబోతాయని నేను పుట్టిందిలే! యివి లేకుండా బొయ్యేనంత మాత్తరాన సావ బొయ్యేదీలే! దేవుడిచ్చిన కాళ్లూ చేతులూ సక్కం గుండాయి. గుండెల్లో దైర్నం నిక్కంగుండాది. ఏ పని చెయ్యడానికైనా సిగ్గ పడబొయ్యేది లే... అట్టాగని దొంగపనీ, తోడుబోతు పనీ చెయ్యబొయ్యేదీలే. కడుపు నింపుకోడానికి కొంగు పరవబొయ్యేది లే. యింగ నాకేటికి బయ్యం...' అనుకుంటా యిల్లు జేరుకునింది గేణమ్మ. అప్పుటికే తాగేసొచ్చి వాకిట్లో యెడంగా ఉన్న సీమ సింతగుబ్బల చెట్టుకింద, నులకమంచం మీద బడి నిద్రబోతండాడు మొగుడు. 'వూరు మెరవణి ముగిసిందంటే సిమ్మాసనం దిగడు మడిసి...' చిరాగ్గా అనుకుంటూ యింట్లోకెళ్లింది.

ఆ పొద్దు కాణ్నించి గేణమ్మ పనుల వరసే మారిపోయింది. నిజానికి తొలి నుంచి ఆమెది ఆ దారే. ఏ పొద్దున ఏ పని దొరికితే అది చేసుకుంటాబోవడం... ఏదొస్తే అదే పలితమనుకోని యెసుట్లో యేసుకోవడం. కానీ యిప్పుడు ఏ పని బడితే ఆ పని జేసే వొయసు కాదు. పనులకు పిల్చేటోళ్లేలేరు. 'వూరు గొడ్డు బోయిందేమోగానీ... కొండాకోనా గొడ్డుపోలేదు గదా,' అనుకుంది. చీకట్తోనే లేస్తాది. కొండలమీదికి, అడివిమీదికి బోతాది. కాపురానికొచ్చిన కొత్తల్లో మాదిరిగా పుల్లలు ఏరుకోని కట్టెల మోపుగట్టి అమ్మేంత సత్తవ లేదిప్పుడు. కొనేటోళ్లూ లేరు. పొదల్లో పొరకపుల్లలు యించి తీసుకొస్తాది. ఆటిని కట్టలు కట్టి కాళాస్తిదాకా బొయ్యి యింటింటికీ తిరిగి అమ్మతాది. కట్టకు అయిదోపదో వస్తాది. వొచ్చిందేదో యెసుట్లోకి... వుడికిందేదో కడుపులోకి... యిట్టా సాగతా వుంది బతుకు.

కొండల్లో పొరకపుల్లలు యేరుకొచ్చి పొరక్కట్టలు అమ్ముకోడం అంటే యినడానికి శానా తేలిగ్గానే కనిపిస్తాదిగానీ, దాని కష్టం దానికుండాది. తిరిగినచోట తిరక్కుండా కొండలన్నీ గాలించాల. ఆటిని మోపు గట్టుకుని రావాల. వాకిట్లో వారం దినాలైనా ఎండలో ఆరెయ్యాల. ఒళ్లంతా నూగుముళ్లే పొరకపుల్లకి! తాకగానే రాలి పోయే నూగుమొత్తం రాలగొట్టాల. పిడికిటికి నిండుగా కుదిమట్టంగా ఉండే కట్టలు గట్టాల. ఆనక అమ్మాల. ఈ పనుల్తో గేణమ్మ ఒళ్లంతా ఆ నూగుముళ్లే అంటుకు నుండేటివి. పగులంతా యెండల్లో కొండల్లో తిరిగేసి సందేళకి వచ్చి అంత తిని నడుం వాలిస్తే... చీరకి అంటుకున్న నూగుముళ్లు సికాకు పెడతాంటాయి. యింతా

పడినా గూడా వొచ్చే దుడ్లు సాలీసాలకుండా అవతండాయి. ఒక్కోపాలి... కొండలన్నీ ఎగుడుదిగుడుగా తిరిగి దొరికినన్ని పుల్లల్తో యింటికొచ్చినాక గడపమీద తలఆన్చి పడుకుంటే ఒంట్లో కండలూ నరాలూ జివ్వుజివ్వుమని లాగేస్తాంటాయి. పేణం ఉసూరుమంటాది. 'ఛూ బతుకు! యీ కట్టె యిప్పటికిప్పుడు కాటికెళ్లిపోవాల,' అనిపిస్తాది. 'యీ ముసిలోడికి గంజి కాసి పోసేదెవురు,' అని యెంటనే యింకో రంధి కమ్మేసుకుంటాది.

అయినా దాని మొగుడికేం... మారాజు బతుకు! నెలబెట్టంగానే లెక్కగా యింటికొచ్చి పించను దుడ్లిచ్చేసి పోతారు. తాగినకాడికి తాగి కొంపకొస్తే వార్చిందేదో ఆర్చి కంచంలో యేస్తాది. 'యేమిరా యీ నా ముసిల్ది కొంపనెట్టా నెడతాండాది,' అని యోచించిన పాపాన పోడు. వొచ్చిందంతా వాడి ముడ్డిలోనే పెట్టుకోనుంటాడు. వోడి బుడ్డీలకే తగలబెడతా వుంటాడు. యేస్తే తింటాడు... యెయ్యకపోతే అడగడు! యెప్పుడేనా కడుపు మండి కేకలేస్తే 'నువు నా పేణమే.. యెన్నయినా అను,' అంటాడు. 'నంగి నా బట్ట. యీడి పేణాన్నీ పేమనీ తగలెట్టా,' అనుకునేది గేణమ్మ తీరిక దొరికినప్పుడు!

గేణమ్మ బేజారెత్తిపోయింది. 'కొండలూ కోనలూ తిరుక్కుంటూ యెన్నాళ్లని పాకులాడేది... యీ ముసిలోడికిచ్చినట్టే సర్కారోళ్లు నా మొహాన గూడా పించను దుడ్లు కొట్టొచ్చుగదా,' అనిపించింది గేణమ్మకి ఓ సందేళపూట. ఏ మూర్తాన అనిపించిందోగానీ ఆ మాట పురుగులాగా బుర్రలోకి దూరి తొలచడం మొదలెట్టింది. నిద్దర్రాలా. 'అవును గదా! కష్టం జేసుకోలేరనే గదా ముసిలోళ్లకి పించనిస్తండారు.. వోడికి ఇచ్చినప్పుడు నాకెందుకు ఇయ్యరు,' అనుకుంది. మేస్త్రీ గొణుగుడులో తెలిసిన వొయసు గెమనానికొచ్చింది. 'నేనంటే మొండిముండనిగానీ... ఈపాటి ముసిలోళ్లు చేతికర్రతో తిరగతాండారు.. వోళ్లకంతా వొచ్చేది నాకెందుకు రాదు,' అనుకుంది. రాతిరంతా అదే సుళ్లు బుర్రలో.

తెల్లారగానే సర్పంచి కాడికి బొయ్యింది గేణమ్మ. "అన్నా జరుగుబాటు సాగడంలే. నాగ్గూడా పించనిప్పించాల," అంది.

యేప్పుల్లతో పళ్లు తోముతున్న వాడెల్లా, ఓపాలి ఉమ్మి, మొహమంతా చేదుగా బెట్టుకోని, "యింటికొక్కరికే గదా గేణక్కా... నీ మొగుడికి వస్తాండాదిగదా అంతే," అన్నాడు.

"ఆయన సంగతి నీకు తెలుసుగదా," అంటే,

"దానికి నన్నేం జెయ్యమంటా," వన్నాడు.

"నువ్వు తలిస్తే అవతాది సామీ," అంటే,

"మా జేజినాయిన తల్సుకున్నా కాదు... గావాల్నంటే ఎమ్మెల్యే కాడికి పో," అంటూ తోవ జూపించినాడు.

ఎమ్మెల్యేకాడికి పొయ్యింది గేణమ్మ-

"నీకు పున్నెముంటాది బిడ్డా... రెక్కాడినంత కాలమూ, పలానాది కావాలని యెవుర్నీ యాచించలా. యియ్యాల నీ వాకిటకొచ్చినా. ముసిలిముండని. నువ్వు దయపెడితే నాకు రెండు దుడ్లొస్తాయి," అడిగింది.

"పెద్దమ్మా! మేమొచ్చినాక రెండుగాదు, రెండున్నర! రోగాలూ రొష్టులూ వొస్తే బయపడబళ్లే... మందులకీ మాకులకీ యెతుక్కోబళ్లే... చిన్నా సన్నా అవసరాలుంటే పైసలకి తడుముకోబళ్లే... అవ్వలూ తాతలూ అందురూ పండగ జేస్కోవచ్చు," తియ్యగా జెప్పినాడు.

"మీరు పంపించిన లచ్చిందేవి మా యింటాయనదాకా వొస్తాదిగానీ... యింటిదాకా రాదు నాయినా... నువ్వు కనికరించినావంటే..." అక్కడికే గేణమ్మకి మానం చచ్చిపోతా వుంది.

వోడేమీ ఉన్నపళంగా తిరగ్గొట్టలా. కుర్చీ మింద కూచోబెట్టినాడు. తాగమని సల్ల యిచ్చినాడు. వంద ఆరాలు తీసినాడు. మంచీ చెబ్బరా అడిగినాడు. యేందేందో యిచారించినాడు.

"ఒక రేషను కార్డు మీద రెండు పింఛన్లియ్యరు గదా పెద్దమ్మా," అన్నాడు కడాకి.

"నాయినా రోగాలు రొస్టులూ అంటివి. మందులూ మాకులూ అంటివి. రేపో మాపో రాలిపోయేటివి.. కొంపలో రెండు ముసలి పేణాలుంటే అక్కర ఒక్కరికే రాబోతాదా? రెండో వాళ్లెట్ట సావాల?" కడుపులోంచి మంట రొవంత యిసురుగానే వొచ్చింది.

"సావనియ్యం," నవ్వినాడు ఎమ్మెల్యే. "సావనియ్యకుండా ఆరోగ్యశ్రీ గావాల్నంటే యిద్దరికీ యిస్తాం," నవ్వతానే అన్నాడు.

"సావు తరవాతికొస్తే యిద్దురుగా కనిపిస్తామా.. బతుకు బరువైంది సామీ అంటే వొకరుగానే కనిపిస్తామా..." తగువాడినా ఫలం లేదని తేలిపోయింది.. గొణుక్కుంటా లేచి నిలబడింది.

"రేయ్.. యీ పెద్దమ్మ తిమ్మసముద్రం నించి వొచ్చుండాదిరా... మంచి బిర్యానీ పెట్టించి పంపండి," కేకేసినాడు.

‘చాల్లే నడువు బయటకి,’ అన్నట్టుగా వినిపించింది గేణమ్మకి!

“యిదిగో యీ పక్కన పెడతన్నారమ్మా బిర్యానీ... తినేసి పో... రొవంత దాహమైనా తాగేసి పో...” వసారాలో పనోడి మాటలు గేణమ్మ చెవుల్లో పడనేలేదు.

‘పెద్దమ్మా’ అన్న పిలుపుకే ఆమె కడుపు నిండిపోయింది. ఆడి నవ్వులకి ఆమె దాహమూ ఎండిపోయింది. ‘ఎమ్మెల్యే అంటే శానా పెద్దోడు గదా, కనికరించక పోతాడా’ అనుకున్న ఆశ అడుగంటిపోయింది.

*

గేణమ్మ యింటికెళ్లిందేగానీ, యెనక్కి మళ్లలేదు. ఇల్లెట్టా గడవాల? కడుపులెట్టా నిండాల? కాయకష్టం తెలిసిన బతుకు ముష్టెత్తనని అంటోంది, వొళ్లు- పనికి వల్ల కాదంటోంది! కడగండ్లు దాటుకుంటూ నిలిచిన బతుకు, బలవంతంగా కడతేరనని యెదురు తిరుగుతోంది, మరైతే తెరువేదని మనసు యెదురడుగుతోంది!!

‘పించను’ గేణమ్మకి పెద్ద యాతనగా మారిపోయింది. ‘యిస్తే బాగుండును,’ అని తొలుత అనుకుంది! ‘నాకెందుకు యియ్యరు,’ అని మలిడతలో మధనపడి పోయింది. ‘యెట్టా యియ్యరో జూస్తా, తేలస్తా,’ అని కడాపటికి సవాలుగా తీసుకుంది. అలా అనుకుని బరిలోకి దిగబోయే ముందు కోడి జూలు రిక్కించి నట్టుగా, లేచి, సిగను ముడేసి, కొంగు బొడ్లో దోపి, ‘యెట్టా యియ్యరో జూస్తా, తేలస్తా,’ అని అనుకోడానికి గేణమ్మకి వారం దినాలు పట్టింది.

“అంత సులువు గాదమ్మా,” అన్నాడు వకీలు, గేణమ్మ కతనీ వెతనీ ఆమె ఆలోచననీ అందులోని లోతునీ విని.

“సులువని నేనంటినా నాయినా... నా పాట్లు కంటివే, నా ఏడుపు యింటివే... కష్టమైనా నువ్వు కనికరించాల, తెగించే వొచ్చినా. తెరువు చూపించాల...”

“రూలట్టా ఉండాది గదా.”

“రూలు దీసి రోట్లోనో గూట్లోనో పెట్టుకోమను. మొగుడూ పెళ్లాల్లో ఒక్కరికి మటుకే అంటారా... రెండోవాళ్లు సావాలనుకుంటారా యెట్టా? ఓ పక్కన కోటీస్పరులు గూడా యీ పించను తీస్కుంటానే వుంటారు. యియ్యాలో రేపో కాటికి బొయ్యే పేణాలకి ‘యింటికొక్కరికే’ అనే మెలిక నాయమెట్టా అవతాది? బతుకు గోరేదా? సావు గోరేదా?”

“చూడ్డానికి చిన్న దావానే. గవుర్మెంటోళ్ల కూసాలు కదల్తాయి.”

“కదలనీ. నాకింకో యిదాయకం కనబళ్లా. యీ దావా యేస్తే ఆళ్ల మానం బజార్లోకొస్తాది. ఆళ్ల కూసమైనా కదలనీ, ఆళ్లలో రోసమైనా పుట్టనీ.”

వకీలు కాదనలేకపోయాడు. అవుననీ, అడిగిన పని అవుతుందనీ అనలేకపోయాడు.

“నాయినా నీ తల్లి వయసుదాన్ని... నువ్వయితే దరమాత్ముడివని విని వొచ్చినా... నీకేమైనా యియ్యాలన్నా నాలుగు కొండ పొరక్కట్టలు తప్ప యింకో గతి లేనిదాన్ని.”

ఆ మాటలు వినే మాదిరి లేడు వకీలు. యోచనలో పడిపోయినాడు. రొవంత తాళినాక...

“అట్నేలే యీసారి వొచ్చేప్పుడు నాలుగు పొరక్కట్టలు పట్రా. ఆళ్ల బుర్రల్లో బూజుల్ని గూడా దులిపేద్దాం,” నవ్వుతూ అన్నాడు.

అలా పడింది కోర్టులో, గేణమ్మ దావా! యెన్ని మలుపులు తిప్పినాడో వకీలు, లెక్కలేదు. యెన్ని రోజులు గడిచినాయో, లెక్క కానే కాదు. ఆరోజు కడపటి రోజు.

కిందటిసారి కలిసినప్పుడు “ఆరోజు నువ్వు రావాల్సిందే,” అన్నాడు. “గంట పది కొట్టకముందే వొచ్చేయ్యాల,” అని గూడా ఎచ్చరించాడు.

అందుకే కోర్టు కాడికొచ్చి తురాయి చెట్టుకింద కూసుంది గేణమ్మ. కోర్టు సందడి మొదలుగాక ముందునుంచీ కూసునే వుంది... సంగతేందో తేల్చేద్దామని!

*

దావా యివరం తెలిసినోళ్లు చెవులు కొరుక్కుంటా వుండారు. కొంగు బుజం సుట్టూ కప్పుకోని, రెండు జబ్బల్నీ రెండు చేతుల్తో పట్టుకోని, ఒదిగి ఒక పక్కగా నిల్చున్నాది గేణమ్మ. పళ్లు గట్టిగా కరుసుకోని, మూతి బిగబట్టి లోపల ఉండేదేదో మొకాన అగుపడకుండా జాగర్తగా నిల్చోనుండాది.

“ఏమ్మా నీ పేరు?” అడిగాడు జడ్జి.

చెప్పింది.

“అదేం పేరు?” అనుమానంగా చూశాడు.

“జ్ఞానమ్మ సారూ... అమ్మవారి పేరు... మన పెద్ద గుడి, అదే శివాలయంలో జ్ఞానప్రసూనాంబ అమ్మవారి పేరు... ఊళ్లలో అలా వాడుకలో వుంటాది,” వకీలు సర్ది చెప్పినాడు.

“నీ భర్తతో విడాకులు గావాల్నా...” వకీలు మాటలు ఆలకించాక, జడ్జి అడిగాడు గేణమ్మని.

మౌనం. తల ఊపింది నిలువుగా.

"సైగలు పనికిరావు. నోటితో చెప్పాల. మాటొస్తుంది గదా..." కొంచెం చిరాగ్గా అన్నాడు జడ్జి.

రెండు గడియలు పట్టినాయి గేణమ్మకి. కళ్లలో ఊరుతున్న తడిని గొంతులోకి దిగమింగడానికి.

"మాట గబగబా రావాల. రోజంతా నీకోసం గూసోలేం," యీసారి కసురు కున్నాడు.

"అవును సారూ..."

"ఎందుకు?"

మౌనం.

"నీ భర్త నిన్ను విడిచి పారిపోయాడా? చెప్పాలి."

"లేదు సారూ."

"నిన్ను నిర్లక్ష్యం చేసి వ్యభిచారం చేస్తున్నాడా? రుజువులున్నాయా?"

"అట్టాంటోడు కాదు సారూ."

"తాగివచ్చి నిన్ను హింసిస్తున్నాడా?"

"నేనంటే ఆయనకి పేణం సారూ."

"పిచ్చి యెక్కిం..."

"చీచీ లేదు సారూ," మద్దెలోనే అడ్డం పడింది.

యింకేవేవో అడిగాడు లేదనే చెప్పింది.

"నీకు విడాకులు యియ్యడం కుదర్దమ్మా... చట్టం ఒప్పుకోదు," ఎక్కువ వ్యవధి తీసుకోలేదు, తేల్చేసినాడు జడ్జీ.

"అయితే నాకు పించనెట్టా వొస్తాది సారూ..." అమాయకంగా అడిగింది గేణమ్మ.

జడ్జీ బొమ్మయిపొయినాడు, గడియసేపే. కళ్లద్దాలు ముక్కు మీదికి యెగదోస్కొని, కళ్లు చికిలించాడు. వకీలు కేసి చూశాడు. ఆయన తల పట్టుకున్నాడు. పాపం అంతకుమించి యింకేం జెయ్యగల్డు. గేణమ్మ విడాకుల కోసం అప్పటిదాకా దావాలో యేదేదో మడతపేచీలు పేర్చుకుంటా వొచ్చినాడు! జడ్జీకి అసలు సంగతి అర్థమైంది. కోపమూ వొచ్చింది.

"కుదర్దమ్మా... నీకు పించను కోసం విడాకులు గావాల్నంటే కుదర్దు," కోపంగా అన్నాడు.

గేణమ్మ దిమ్మెరపోయింది. కోర్టులో యేం జెప్పాల్నో, వకీలు యేదేదో నేర్పించినాడుగానీ గేణమ్మ ఆడికి రాగానే అయ్యన్నీ మర్సిపోయింది. మొగుడి సంగతి రాగానే పొల్లు మాట చెప్పలేకపోయింది.

"యింక పోవచ్చు..." అంటున్నాడు జడ్జీ.

అప్పటిదాకా బిగపట్టుకున్న గేణమ్మ బింకం సడలిపోయింది. గుండె పగిలి పోయింది. కట్టలు తెగిపోయాయి. ఒక్కసారిగా తనకు తానే వయసు పైబడిన ముసల్దానిలాగా అనిపించింది. పసితనం నుంచి పండిపోయేదాకా చేసిన రెక్కల కష్టం మొత్తం ఒకేసారి కుంగదీసినట్టు కుప్పకూలిపోయింది. నిస్త్రాణగా అప్పటిదాకా నిల్చుని ఉన్నదెల్లా... కుప్పగా గొంతు కూర్చుండిపోయింది, భోరున ఏడుస్తూ.

పెద్దగుడి అమ్మోరి కుంకం అలికినట్టుగా నేలంతా పరచుకుని, ఎర్రగా మెరస్తుండాది కోర్టులో తివాచీ. ఆ మూలన, యెలిసిపోయిన పసుపురంగు నేతచీరలో, ఉద్వేగంతో ధారలు కట్టిన చెమటలో, ఉబికి ఉబికి వస్తున్న కన్నీళ్లలో తడిసిపోతూ... తమలపాకు మీద పెట్టే పసుపుముద్ద వినాయకుడు కరిగిపోతున్నట్టుగా... కూసో నుండాది గేణమ్మ!

"నేనొక మాట జెప్పుకోవచ్చునా సారూ..." యేడుపు బిగబట్టి జడ్జీకేసి అడిగింది తలెత్తకుండానే. ఆయన నిలువుగా తల ఊపాడు. అది గూడా జూసుకోకుండానే... గేణమ్మ మొదులెట్టింది.

"గన్నేరుపప్పు తెచ్చి నూరి, గోగాకు పచ్చళ్లో కలిపి పెట్టుకున్నాను సామీ వారం దినాల ముందర. నేను సావాలనుకున్నా. నా మొగుడికీ సంగటితోపాటు తినిపిద్దా మనుకున్నా! ఒక రేషనుకార్డు మీద ఒకరికే యిస్తారంట పింఛను. ఏమి సామీ, ఒక సూరు కింద రెండు ముసిలి పేణాలు బతకనేగూడదా? యిద్దరం సస్తే పోద్ది గదా...! గన్నేరుపప్పు నూరిపెట్టినా! ఆ పూట తాగి వచ్చినోడికి సంగటి పెట్టినానుగానీ... గోగాకు పచ్చడి పెట్టలా... మనసు రాలా... చేతులు రాలా...! ఆ పచ్చడంతా యెత్తుకోని బొయ్యి బురదగుంటలో కలిపేసినా.

"యేం జెయ్యమంటావు. వోడొక్కడికీ పింఛనొస్తాది, ఆ దుడ్డు కొంపలోకే రాదు. యెట్ట గడవాల? రెండు కడుపులు యెట్ట నిండాల. నిన్నటిదాకా, నాకు పింఛనొస్తే యేందీ... సస్తే యేందీ... అనుకుని, యేదో కూలీనాలికి పోతానే వుంటిని. నిన్నటిలాగా యియ్యాల లేకపాయె. కస్టానికి నేను పనికిరానిదాన్నయిపోతిని. యేం జెయ్యమంటావు.

“యెన్నిసార్లు అనుకున్నానో తెలుసా సామీ... నేనే సావాలని! ముందర నేను జస్తే యెట్టా? వోడికి ముద్దబెట్టే దిక్కులేదే. సివరాకరికి వోడికి దక్కేదీ సావే. ఆ సావేదో నేనే యిచ్చేస్తే పోలా. వోణ్ని సంపి, వొచ్చే ఆ పించనేదో నా యెదాన కొట్టుకుని బతికిపోవచ్చు గదా.”

ఆయాసపడతా వుంది గేణమ్మ. బుజం చుట్టూ కప్పి ఉన్న కొంగు తీసి మొహం తుడుచుకుంది. ముక్కు చీదుకుంది. దాన్ని బిగదీసి బొడ్లో దోపుకుంది. కొంచం తెప్పరిల్లి మళ్లీ అందుకుంది.

“యెన్నిసార్లు అనుకున్నానో తెలుసా సామీ... యీ నా మొగుణ్ని చంపెయ్యాలని? పీకల్దాకా తాగొచ్చి ఒళ్లు తెలియకుండా పడుండేవోడిని... ముక్కు మూస్తినంటే గడియ! పీక పడితినంటే రెండు గడియలు!

“ఎనబయ్యేళ్ల ముసిలి నా బట్ట యెట్టా జచ్చినాడని నన్ను ఎవుడడగబోతాడు? ఎవుడొచ్చి ఆరాలు తియ్యబోతాడు? సద్దికూటేళకి సావైతే, పగుటికూటేళకి పాడెత్తెయ్యడమే... పాతిపెట్టెయ్యడమే గదా! సందేళకి గాకపోతే మరు దినానికైనా నాకు పించనొస్తాది గదా...?”

సంతకం పెట్టెయ్యబోతూ ఆగినవాడల్లా, జడ్జి అలాగే ఉండిపోయాడు. వకీలు తన కుర్చీలో కూలబడ్డాడు. కోర్టులో ఫ్యాన్లు తిరుగుతున్న చప్పుడొక్కటే వుంది. గేణమ్మ గొంతు ఉరిమినట్టుగా యినిపిస్తా వుంది.

“యేం జెయ్యమంటావు సామీ...? సంపెయ్యమంటావా? చేతులు రావట్లేదే... నన్ను పేణంలా జూసుకున్న మొగుడు... నన్ను పువ్వులా జూస్కున్నాడు సామీ... ముసిలోడైపొయినాడుగదా... వోడికొచ్చే దుడ్లు యెసుట్లోకి యియ్యడం లేదుగదా అని సంపెయ్యమంటావా...? దుడ్లొక్కటేనా ఆడికీ నాకూ... యింకేం లేదా...? యెట్టా సంపేది? ఆడిని సంపకపోతే యెట్టా బతికేది? యిదొక్కటే దారి కనిపించింది సామీ... యిదొక్కటే దారి...” వెక్కిళ్లలో మాటలు మింగేసింది గేణమ్మ. కోర్టంతా గేణమ్మ ఏడుపూ, వెక్కిళ్లూ తప్ప యింకోటిలేదు. వెక్కివెక్కి గమ్మునగా ఉండిపోయింది.

తేరుకున్నాడు జడ్జి. రెప్పలు ఆర్చాడు. కళ్లజోడు సర్దుకుంటున్నట్టుగా... బుగ్గలమీద చుక్కలు తుడుచుకున్నాడు. గాజు లోటా అందుకుని రెండు గుక్కలు నీళ్లు తాగాడు. కుర్చీ దిగి లోపలి గదిలోకెళ్లి గడియలోనే తిరిగొచ్చినాడు. ఈ లోపల వకీలు, గేణమ్మ కాడికొచ్చి ఏదో చెప్పినాడు.

జడ్జి తిరిగి రాగానే గేణమ్మకేసి మళ్లీ అడిగాడు. "నీ భర్త తాగివచ్చి నిన్ను కొడుతున్నాడా..."

జవాబు- వకీలు నేర్పినదే. కానీ చెప్పడానికి రెండు క్షణాలు అవసరమయ్యాయి గేణమ్మకి.

"అవును సారూ," అంది ఈసారి. అది చాలు ఆయనకి!

*

పెద్దగుడిలో జనం రచ్చరచ్చగా వుంటాది. గేణమ్మ చిన్నగుడికెళ్లింది. తిన్నెలమీదా, అరుగుల మీదా చిన్న చిన్న గుంపులుగా జేరి జనం ముచ్చట్లు చెప్పుకుంటండారు. ఖాళీగా వుండే గుళ్లోకెళ్లింది. వరదరాజులు చానా నిమ్మళంగా నిల్చోనుండాడు. చమురు దీపాల యెల్తురులో పూలు, తులసాకుల మాలల్తో గొప్పగా కనిపిస్తండాడు. దేవుణ్ని కన్నార్పకుండా జూస్తా... తనకు తెలీకుండానే కుడిచేత్తో మెళ్లో పసుపుతాడును తడిమింది గేణమ్మ. తడితడిగా తగిలింది. చెమటా, కారిన కన్నీళ్లూ కలిసి చేసిన తడి. తడి ఆరని ఒంటికి ఇంకా గట్టిగా అతుక్కోనుండాది. 'ముడెయ్యించుకోడమే నీ చేతుల్లో ఉండేటిది, తుంచుకోడం, తప్పించుకోడం అంతా నా చేతుల్లో పని...' అని శివయ్య చెబుతున్నట్టుగా ఉండాది వరదరాజు గుళ్లో నిల్చున్న గేణమ్మకి.

'సామీ... నువ్వూ, ఆ పెద్దగుడి శివయ్యా, గేణమ్మా... మీరు ముగ్గురూ గలిసే నా నెత్తిన పాలు బోసినారు,' అని ముసిముసిగా నవ్వుకుంటా దణ్ణం పెట్టుకునింది గేణమ్మ.

ఈలోపల ఆరతి తట్టతో వొచ్చినాడు పూజారి, గునగున మంత్రాలు చదువుకుంటా! కొంగుముడిలో కట్టుకున్న వాటిలోంచి పదిరూపాయల నోటు తీసి, తట్టలో యేసింది.

'పేరు చెప్పమ్మా?' అన్నాడు.

'తిమ్మసముద్రం యీరాసామి.'

యాభయ్యేళ్ల యెక్కదీసిన సంసారంలో, మొగుడి పేరు ఏనాడూ తన నోటితో చెప్పేరగకపాయినా, తడబడకుండా చెప్పింది గేణమ్మ.

ఆ పేరు పలికేసి, గేణమ్మ గురించి అడగనైనా అడగకుండానే, 'సహ కుటుంబానాం,' అంటూ సాగదీసి... ఆ ముసిలోళ్ల గురించి దేవుడికి ఏం కొత్తగా చెప్పాలనుకున్నాడోగానీ... గొణుక్కుంటా ఆరతి తట్టని లోనికి పట్టకపాయినాడు పూజారి!

గుడి యెనక జాగాలో, నిలబడిన దీపానికి కాసింత యెడంగా ఒంటిరెక్క నందివర్ధనాల చెట్టుంటే... యెల్లి దాని దాపున కూసుంది. రాలిన పూలన్నీ తెల్లపూల తివాచీ మాదిరిగుండాయి. వకీలు ఇంటికి తొలిమారు పొయిన కాడినుంచీ ఒక్కొక్కటీ జరిగినటివి అన్నీ గెమనానికి తెచ్చుకుంది. అప్పటికి పొద్దు వాలిపోయి, సీకటి ముసురుకుంటాండాది. పురుగుల రొద పెరిగింది. నెమ్మదిగా లేసి, రోడ్డుమీది కొచ్చింది. మిఠాయి అంగడికెళ్లి రెండు జాంగ్రీలు పొట్లం కట్టించుకుంది. బస్సెక్కి టిక్కెట్టు కొన్న తర్వాత.. కళ్లుమూసుకుని, చిద్విలాసంగా...

'నా ముసిలోడికి ఇయ్యంటే చానా యిష్టం,' అనుకుంది గేణమ్మ.


రోడ్డుమీద పరుగెత్తతా వుంది బస్సు.

చుట్టూతా చీకటి.

గేణమ్మ కూచున్న కిటికీ పక్కన మిణుగురులు మినుకు మినుకుమని ఆరతా యెలగతా... ఆమెతో పాటూ యెలబారతండాయి.

*సంగతి-2022 టెల్సా కథల, కవితల పోటీ ప్రత్యేక సంచిక*
*22 డిసెంబర్ 2022*

*



13 డిసెంబర్ 1972న చిత్తూరు జిల్లాలో పుట్టిన కె.ఎ. మునిసురేష్ పిళ్లె మొదటి కథ ఆదర్శిని పత్రికలో అచ్చయింది. 100కు పైగా కథలు రాశారు. రెండు కథాసంపుటాలు- *పూర్ణమూ నిరంతరమూ*, *రాతి తయారి*, ఒక నవల ప్రచురించారు. *సదాస్మరామి*, *గురు శిఖరం* పుస్తకాలకు సంపాదకత్వం వహించారు. జర్నలిజం వృత్తిలో ప్రస్తుతం ఫ్రీలాన్సర్‌గా ఉన్నారు.

***చిరునామా:** ఫ్లాట్ నెం. 501, అన్నమయ్య రెసిడెన్సీ, రోడ్ నెం. 38*
***అయ్యప్ప సొసైటీ, మాదాపూర్, హైదరాబాద్-500 081***
***ఫోన్: 99594 88088*** **kamspillai@gmail.com**